


భవితకు బంగారుబాట

కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ పాఠశాలలో ఆరోతరగతిలో చేరేందుకు ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. 8లో▸



బాసర ఆలయంలో పౌర్ణమి పూజలు

పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం బాసర అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించి శతఃఅర్చన పూజలు జరిపించారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.4 / 11.2

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. రాత్రి మంచు ఎక్కువగా కురుస్తుంది. చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు బీజేపీ వర్చువల్ మీటింగ్



సమావేశంలో మాట్లాడుతున్న భూమయ్య

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్మల్ అసెంబ్లీ పోలింగ్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆధ్వర్యంలో వర్చువల్‌గా నిర్వహించే సమావేశంలో బూత్ అధ్యక్షులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ నాయుడి మురళీధర్, ఉపాధ్యక్షుడు కమల్ నయన్, జిల్లా కార్యదర్శులు రాజేందర్, విలాస్, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్, దళితమోర్చా అధ్యక్షుడు రాచకొండ సాగర్, ఓబీసీ అధికార ప్రతినిధి అమరవేని నర్సగౌడ్ పాల్గొన్నారు.

'చి'వరి' దశకు ధాన్యం కొనుగోళ్లు

భైంసాటౌన్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావచ్చాయి. మరో వారం రోజుల్లో ప్రక్రియ పూర్తి కానుంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కేంద్రాల నుంచే నేరుగా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ మేరకు రైతుల ఖాతాల్లోనూ డబ్బులు జమ చేస్తున్నారు. డీఆర్డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, జీసీసీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. ధాన్యం దిగుబడి అంచనా 1,54,394 మెట్రిక్ టన్నులు కాగా, జిల్లాలోని 200 కేంద్రాల్లో ఇప్పటివరకు 31,953మంది రైతుల నుంచి 1.36 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. రైతుల ఖాతాల్లో రూ.265.36 కోట్లు జమ చేశారు. ఇంకా రూ.8.75 కోట్లు చెల్లించాల్సి ఉంది. గతనెల 31లోగా కొనుగోళ్లు పూర్తి కావాల్సి ఉండగా, మరోవారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 200 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 194 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయినట్లు సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ తెలిపారు. మిగతా చోట్ల త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

'వీరుల చరిత్ర తెలుసుకోవాలి'



కరపత్రం పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

భైంసాటౌన్: తెలంగాణలో నిజాం నిరంకుశ పాలనపై పోరాడిన వీరుల చరిత్ర, తెలంగాణకు స్వాతంత్ర్యం సిద్ధించిన తీరును నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరముందని నైజాం విముక్త ఉత్సవ సంచాలన సమితి సభ్యులు సూచించారు. నిజాం విముక్త స్వాతంత్ర్యోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నర్సింహనగర్‌లో శుక్రవారం జనజాగరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు, సాహిత్యం ద్వారా అవగాహన కల్పించారు. రాంజీగోండు, నారాయణరావు లాంటి ఎంతోమంది వీరులు రజాకార్లకు ఎదురించిన ఫలితంగానే తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందని తెలిపారు. ఇలాంటి వీరుల చరిత్ర నేటితరం తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మారుతి, రాహుల్ ముండ్గా, రాజు, సాదుల కృష్ణదాస్, డాక్టర్ మహిపాల్, యోగేశ్ తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి

కుంటాల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. రిఫ్రిజిరేటర్, నీటిశుద్ధి యంత్రం, డైనింగ్ టేబుల్, టీవీ, కుర్చీలు, వంటగ్యాస్ సిలిండర్, స్టౌ తదితర 30 రకాల సామగ్రిని ఆయా కేంద్రాలకు శుక్రవారం పంపించినట్లు భైంసా సీడీపీవో నాగలక్ష్మి తెలిపారు. డీపీఎం జాకీర్‌హుస్సేన్, పీఆర్ ఏఈ సూర్యతేజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద ఉన్నారు.

డైరీ ఆవిష్కరణ

నిర్మల్ రూరల్: స్టేట్ టీచర్స్ యూనియన్ నూతన సంవత్సర డైరీని కలెక్టర్ ముషరఫ్ అలీ ఫారూఖీ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జుట్టు అశోక్, నాంపల్లి నాగభూషణ్ పేద విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పెన్నుల బాక్సును కలెక్టర్‌కు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూమన్నయాదవ్, లక్ష్మణ్, వెంకటేశ్వర్‌రావు, మసూద్, పోతన్న, అన్సార్ అహ్మద్, ఇర్ఫాన్ షేక్ పాల్గొన్నారు.

యాసంగికి కడెం నీరు



కడెం ప్రాజెక్ట్ సమాచారం
పూర్తిస్థాయి నీటి మట్టం 7.603 టీఎంసీలు
ప్రస్తుత నీటి మట్టం 6.308 టీఎంసీలు
గతేడాది నీటి మట్టం 7.246 టీఎంసీలు
యాసంగి సాగు విస్తీర్ణం 25 వేల ఎకరాలు

- ఈనెల 10నుంచి మార్చి 31వరకు..
- డీ–1 నుంచి డీ–28 వరకు సాగునీరు
- ఐదు తడులే అంటున్న అధికారులు
- ఎనిమిది తడులివ్వాలంటున్న రైతులు
- ప్రస్తుత నీటినిల్వ 6.308 టీఎంసీలు



ఎడమ కాలువ నుంచి దిగువకు వెళ్తున్న నీరు (ఫైల్)

కడెం: గత ఖరీఫ్‌నకు సాగునీటిని అందించిన కడెం ప్రాజెక్ట్ యాసంగికి కూడా నీటిని విడుదల చేయనుంది. ఈ నెల 10నుంచి మార్చి 31వరకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 3న ఖానాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు రేఖానాయక్, దివాకర్‌రావు ప్రాజెక్ట్ అధికారులతో సమావేశమై నీటి విడుదలపై చర్చించారు. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నిల్వ 694.775 అడుగులు అనగా 6.308 టీఎంసీలున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గతేడాది కంటే ప్రాజెక్ట్‌లో నాలుగు అడుగుల నీటిమట్టం తక్కువగా ఉండగా ఎస్సారెస్పీ నుంచి నీటిని కడెంకు వదిలి సాగునీటిని అందించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఎనిమిది తడులు ఇవ్వాలి



కడెం ప్రాజెక్ట్ నుంచి యాసంగికి ఐదు తడుల నీరు విడుదల చేస్తే పంటలకు పూర్తి స్థాయిలో నీరందదు. ఎనిమిది తడుల అందించి చివరి దశలో పంటలు ఎండిపోకుండా చూడాలి.
– దాకూరి తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా అధ్యక్షుడు

ఆరుతడి పంటలే వేయాలి



స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయకట్టు రైతాంగంతో సమావేశం నిర్వహించి ఈ నెల 10నుంచి సాగునీరు విడుదల చేయాలని తీర్మానించాం. రైతులు మార్చి 31లోగా పంటలు పూర్తయ్యేలా చూసుకోవాలి. ఆరుతడి పంటలే సాగు చేయాలి.
– బోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్

డీ–28 వరకే సాగునీరు

కడెం ఎడమ (ప్రధాన) కాలువకు జనవరి 10నుంచి మార్చి 31వరకు నీటిని విడుదల చేస్తారు. వారబందీ పద్ధతిన ఎనిమిది రోజులు నీటిని విడుదల చేసి ఏడు రోజులు నిలిపివేస్తూ.. ఇలా మార్చి 31 వరకు ఐదు తడుల నీటిని విడుదల చేయనున్నారు. ఆయకట్టు కింద ఖరీఫ్‌లో కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 68,150 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. యాసంగిలో సుమారు 40వేల ఎకరాల్లో సాగు కానున్నాయి. అయితే 1వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 28వ డిస్ట్రిబ్యూటరీ వరకు కడెం ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయగా, 30వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 42వరకు గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయకట్టు కింద ఆరుతడి పంటలే సాగు చేయాలని తెలిపారు. యాసంగి పంటలను మార్చి 31లోగా పూర్తయ్యేలా చూసుకోవాలని సూచిస్తున్నారు. కాగా, ఐదు తడులు ఇస్తే పంటలు చివరి దశలో ఎండి పోయే ప్రమాదముంటుందని, ఎనిమిది తడులు ఇచ్చి సాగుకు సహకరించాలని ఆయకట్టు రైతాంగం కోరుతోంది.

వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం చేయాలి

- కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లోని కొండాపూర్‌లో గల సెయింట్ థామస్ పాఠశాలలో ఈ నెల 9నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కలెక్టర్ ముషరఫ్ ఫారూఖీ సూచించారు. ప్రదర్శన నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్లు హేమంత్ బోర్కడే, రాంబాబుతో కలిసి వివిధశాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రదర్శనను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తి, అభిరుచి కలిగించేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శన దోహదం చేస్తుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే విద్యార్థులు, గైడ్ టీచర్లకు అన్ని వసతులు కల్పించాలని సూచించారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రదర్శన ఏర్పాట్లను ఇటీవల రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధ పర్యవేక్షించినట్లు తెలిపారు. ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా రెండు బెలూన్లు, రెండు ప్రత్యేక టెలిస్కోపులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతలుగా బాసర ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వ్యవహరిస్తారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఎంఈవోలు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

కనీస వేతనం అందించాలని నిరసన



నిరసన తెలుపుతున్న స్కీం వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: స్కీం వర్కర్లకు కనీస వేతనంగా రూ.26వేలు అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం గేటు ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లవుతున్నా స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు చేరవేయడంలో స్కీం వర్కర్లు కీలక పాత్ర పోషించారని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేసి, 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు అందించాలని, మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం ప్రతీ ఒక్కరికి కనీస వేతనం రూ.15,600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజమణి, ఉపాధ్యక్షులు శైలజ, శశికళ, భూలక్ష్మి, రత్నమాల, కవిత, రమ్య, లావణ్య, దేవిక, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ చంద్రకళ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

'డబుల్‌బెడ్రూం'ల కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

బాసర(ముథోల్): అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావుపటేల్ ఆధ్వర్యంలో భైంసా–నిజామాబాద్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావుపటేల్ మాట్లాడుతూ.. హామీ ఇచ్చి ఎనిమిదేండ్లయినా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు మంజూరు చేయడంలేదని ఆరోపించారు. గూడు లేని పేదలు సొంత స్థలాల్లో ఇల్లు నిర్మించుకుంటే రూ.3 లక్షలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ హామీ కార్యరూపం దాల్చడంలేదని విమర్శించారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలకు అంతరాయమేర్పడింది. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, శ్రీను పటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు

పురుగుల అన్నం ఎట్ల తినాలే?



పురుగుల అన్నం చూపిస్తున్న విద్యార్థులు

- పాఠశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

తానూరు: వారం రోజులుగా మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నాయని.. ఎలా తినాలని మండలంలోని బోరిగాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రశ్నించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శుక్రవారం కూడా మధ్యాహ్న భోజనంలో తోక పురుగులు వచ్చాయని తెలిపారు. దీంతా తాము ఆకలితో ఉన్నప్పటికీ భోజనం చేయలేదని, సమస్య పరిష్కరించాలని కోరారు. కాగా, బియ్యంలోనే పురుగులు వస్తున్నాయని.. ఎంత శుభ్రం చేసినా అప్పుడప్పుడు ఇలా అన్నంలో వస్తున్నాయని ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథ్ అప్పా తెలిపారు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. అనంతరం ప్రాథమిక పాఠశాల నుంచి బియ్యం తీసుకువచ్చి విద్యార్థులకు వండి వడ్డించినట్లు తెలిపారు. ఎంఈవో సుభాష్‌ను వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని, మరోసారి సమస్య పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ముథోల్: ఈ నెల 11న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభ ప్రచార పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు ఎం.హరిత మాట్లాడారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్‌ను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అయినా సీఎం కేసీఆర్ వారి వేతనాల పెంపుదల, పర్మనెంట్ విషయంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో కేజీబీవీల్లో వేతనాలు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. బంగారు తెలంగాణలో కనీసం వర్కర్స్‌కు గుర్తింపు కార్డులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీల్లో వంట వర్కర్స్, స్వీపర్స్ స్కావెంజర్‌కు రక్షణ పరికరాలు ఇవ్వాలని కోరారు. ఏఎన్ఎంలకు వారంలో మూడు నైట్ డ్యూటీలను రద్దు చేసి రోస్టర్ పద్ధతిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రతీ స్కూల్‌కు ఫైర్ సేఫ్టీ వెహికల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కేర్ టేకర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. మహాసభకు వర్కర్స్ అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కవిత, లక్ష్మి, కళ్యాణి, గోదావరి, భూమవ్వ, లత తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి
- ముగిసిన ట్రస్మా క్రీడా పోటీలు



ఖోఖో విజేతలకు ట్రోఫీ ఇస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రెండురోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి ట్రస్మా క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు డీఈవో ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. పోటీలను నిర్వహించిన ట్రస్మా సంఘాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం డీఈవో, డీఎస్పీ జీవన్‌రెడ్డిని ట్రస్మా నాయకులు శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి గంగన్న, కోశాధికారి కొమ్ము వినోద్‌కుమార్, పట్టణాధ్యక్షుడు చంద్రగౌడ్, సెక్రటరీ పద్మనాభగౌడ్, ఉపాధ్యక్షుడు మంచిర్యాల నాగభూషణ్, పెటా అధ్యక్షుడు రమేశ్, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులున్నారు.

విజేతలు వీరే..

ఖోఖో సీనియర్ బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో రవి ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో విజయ ఉన్నత పాఠశాల, సీనియర్ బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో రవి ఉన్నత పాఠశాల, ద్వితీయ స్థానంలో విజయ హైస్కూల్, ఓవరాల్ చాంపియన్‌షిప్ టీం ఈవెంట్, ఓవరాల్ చాంపియన్‌షిప్ అథ్లెటిక్స్‌లో రవి ఉన్నత పాఠశాల నిలిచింది. వాలీబాల్ బాలురు, బాలికల విభాగంలో మొదటి స్థానంలో రవి హైస్కూల్, రెండో స్థానంలో ప్రిన్స్ హైస్కూల్ విజేతలుగా నిలిచాయి. అలాగే వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీల విజేతలకూ బహుమతులు అందించారు.

విద్యాశాఖలో సంక్షోభాన్ని తీర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

దిలావర్‌పూర్: రాష్ట్ర విద్యాశాఖలో నెలకొన్న సంక్షోభాన్ని వెంటనే తీర్చాలని టీటీయూ జిల్లా అధ్యక్షుడు జీ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు నాలుగేళ్లుగా బదిలీలు, ఏడేళ్లుగా పదోన్నతులు, పదిహేనేళ్లుగా పర్యవేక్షణాధికారుల పోస్టులు భర్తీ చేపట్టడంలేదని పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న హైస్కూల్, పీఎస్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓస శ్రీనివాస్, మండలాధ్యక్షుడు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వయం కృషితోనే ఆర్థికాభివృద్ధి



గానుగ యంత్రాన్ని ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

దిలావర్‌పూర్: స్వయం కృషితోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని డీఆర్డీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గుండంపల్లి గ్రామంలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గానుగ నూనె యంత్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రతీ గ్రామంలో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకుని పలువురు స్వయం ఉపాధి పొందుతున్నట్లు చెప్పారు. కార్యక్రజుమంలో స్త్రీనిధి ఆర్ఎం సరిత, ఏపీఎం సులోచన, గ్రామైక్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖానాపూర్: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం జెడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయుడు మల్లికార్జున్‌పై దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని లంబాడా హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడిపై దాడి చేసిన బీజేపీ, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తల దౌర్జన్యాన్ని అరికట్టాలని, ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన సమితి రాష్ట్ర కార్యదర్శి అశోక్ నాయక్ తదితరులున్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


సోన్‌టాకే శివ(ఫైల్)

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్రా గ్రామానికి చెందిన సోన్‌టాకే శివ(26) జాతర్ల గ్రామ సమీపంలో క్వారీలో మడుగులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఎస్సై సయ్యద్ ముజాయిద్ వివరాల ప్రకారం... సోన్‌టాకే శివ ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం సాయంత్రం చేనులో ఉన్న తండ్రి సోన్‌టాకే నగేష్ వద్దకు వెళ్లి మాట్లాడి వెళ్లిపోయాడు. సాయంత్రం భూతాయి గ్రామానికి చెందిన మిత్రుడు వికాస్‌కు ఫోన్‌లో ఎలుకల మందుతాగి చనిపోతానని చెప్పాడు. ఆందోళన చెందిన వికాస్ బోస్రా గ్రామానికి చెందిన ప్రణవ్‌కు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రి నుంచి శివ కోసం గాలించగా శుక్రవారం ఉదయం జాతర్ల గ్రామ సమీపంలో క్వారీ మడుగులో శవమై కనిపించాడు. కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి సోన్‌టాకే నగేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో 17మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్-3, 5 పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 17మంది విద్యార్థులు డిబార్ అయ్యారు. ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ మండల కేంద్రంలోని త్రిదేవి డిగ్రీ కళాశాలలో 10మంది విద్యార్థులు, చైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, ఖానాపూర్‌లోని అజ్మీర రేఖాశ్యామ్ కళాశాలలో ఒకరు, మంచిర్యాలలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు, భవిత డిగ్రీ కళాశాలలో ఒకరి చొప్పున విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు.

గురువుపై అభిమానం.. పాఠశాలకు రూ.లక్ష విరాళం


చెక్కును అందిస్తున్న ప్రిన్సిపాల్ ఉమేశ్‌రావ్

బోథ్: చదువు చెప్పిన గురువుపై అభిమానంతో ఓ శిష్యుడు పాఠశాలకు రూ.లక్ష విరాళంగా అందించాడు. అమెరికాలో ఉంటున్న నిర్మల్ జిల్లా పొన్కల్ గ్రామానికి చెందిన పి.ప్రశాంత్ తన గురువు బోథ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమేష్‌రావ్ పాఠశాల అభివృద్ధి కోసం చేస్తున్న తపనను సోషల్ మీడియా, వాట్సాప్‌లో చూసి ప్రిన్సిపాల్ ఉమేష్‌కు రూ.లక్షను పంపించాడు. ఈ మొత్తాన్ని శుక్రవారం ఉదయం ఎస్‌ఎంసీ సభ్యులకు ప్రిన్సిపాల్ అందజేశాడు. పాఠశాలలో పదో తరతగతి విద్యార్థులు, ఇంటర్ విద్యార్థుల కోసం చదువుకోవడానికి కుర్చీలు, గ్రౌండ్ నవీకరణ, వాలీబాల్, ఖోఖో మైదానాలను ఏర్పాటు చేయడం కోసం ఉపయోగిస్తామని ప్రిన్సిపాల్ ఉమేష్ తెలిపారు. విరాళంగా ఇచ్చిన ప్రశాంత్ అమెరికా నుంచి ఉదయం విద్యార్థులతో జూమ్‌లో ముచ్చటించారు. తన గురువు మీద అభిమానంతో విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు.


ఖందేవ్ ఆలయానికి పూజ సామగ్రితో..

మహాపూజకు తొడసం వంశస్తులు

నార్నూర్: ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం ఖందేవుడి మహాపూజకు ఆలయం ముస్తాబైంది. మండలంలోని మాన్కాపూర్ గ్రామ సమీపంలోని గోవర్దన్‌గుట్ట వద్ద గల మాసేమాల్ దేవతకు ప్రత్యేక పూజలు చేసినంతరం తొడసం వంశస్తులు శుక్రవారం అక్కడి నుంచి కాలినడకన, కొందరు ఎండ్లబండిపై ఖందేవ్ పుణ్యక్షేత్రనానికి బయలుదేరారు. సాయంత్రం ఆలయానికి చేరుకుని రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు పుష్యపౌర్ణమి సందర్భంగా మహాపూజ నిర్వహిస్తారు. సంప్రదాయ, సంస్కృతి ప్రకారం దేవుడికి పూజలు చేసినంతరం 15 రోజుల పాటు జాతర కొనసాగుతుందని తొడసం వంశానికి చెందిన కడోడాలు తొడసం బాపురావు, తొడసం రాజు, ఆలయ కమిటీ నిర్వహకులు తొడసం నాగోరావు తెలిపారు.


ఖందేవ్ ఆలయానికి ఎడ్లబండిపై వస్తున్న తొడసం వంశస్తులు


మహాపూజకు ముస్తాబైన ఆలయం


ఆలయం వద్ద తొడసం వంశానికి చెందిన పెద్దలు

భవితకు బంగారు బాట


కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం

- జవహర్ నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశప్రక్రియ షురూ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 31 వరకు గడువు
- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి గల సంస్థ, అక్షరాస్యత, పాఠశాల విద్యావిభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. విద్యాలయంలో 80 సీట్లకు గానూ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 31 వరకు దరఖాస్తుకు గడువు విధించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2023, ఏప్రిల్ 29న(శనివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ప్రక్రియ ప్రారంభించారు.

అర్హతలు ఇవే..

- 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి.
- ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు పూర్తి విద్యా సంవత్సరాలు చదివి ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థులు 2011, మే1 నుంచి 2013 ఏప్రిల్ 30 మధ్య జన్మించిన వారై ఉండాలి.
- కనీసం 75 శాతం సీట్లు జిల్లాలోని గ్రామీణ విద్యార్థులతో నింపబడతాయి.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులైన విద్యార్థులకు రిజర్వేషన్ ఉంటుంది.
- బాలికలకు కనీసం 1/3 వంతు సీట్లు కేటాయించబడ్డాయి.

విద్యాలయం ప్రత్యేకతలు

- జిల్లా విద్యాలయంలో సహవిద్యా, ఆవాసీయ పాఠశాల
- బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్
- ఉచిత విద్య, భోజన, వసతి సదుపాయాలు
- మైగ్రేషన్ పథకం ద్వారా విసృతమైన సాంస్కృతిక వినిమయం
- స్పోర్ట్ అండ్ గేమ్స్ వృద్ధి
- ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌ఎస్‌ఎస్
- నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి, ఉత్తమ ఫలితాల సాధన
- జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ వంటి ఉన్నత పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ
- 'పది' ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మంచి భవిష్యత్తు కోసం విద్యార్థులు కష్టబడి చదవాలి. మరిన్ని వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలి.

– బి.చక్రపాణి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం



బాసర ఆలయంలో పౌర్ణమి పూజలు

బాసర(ముధోల్): పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం బాసర అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించి శతఃఅర్చన పూజలు జరిపించారు. ఆలయ అధికారులు, వైదిక బృందం సభ్యులు పాల్గొన్నారు.

జనాలను మోసం చేస్తున్న ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- మరో నలుగురి కోసం గాలింపు
- నకిలీ బంగారం, కరెన్సీ స్వాధీనం


నకిలీ కరెన్సీ, బంగారం గొలుసు

నేరడిగొండ: జనాలకు నకిలీ బంగారం అంటగట్టి, నకిలీ నోట్లతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రోల్‌మామడలో పోలీసులు బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు వ్యక్తులు కారులో వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయగా 11 తులాల 30 గ్రాముల బంగారు రంగుగల చైన్‌లతో పాటు రూ.100 నకిలీ నోట్లు గుర్తించారు. వాటిపై చిల్డ్రన్స్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉండగా అనుమానం వచ్చిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో ఆదిలాబాద్‌కు చెందిన ముగ్గురు, ఇచ్చోడకు చెందిన ఇద్దరితో పాటు మరో ఇద్దరు మొత్తం ఏడుగురు ఒక గ్రూపుగా ఏర్పడి డబ్బులకు ఆశపడి నకిలీ బంగారం వస్తువులను ప్రజలకు అంటగట్టినట్లు ఒప్పుకున్నారు. దీంతో పాటు గత నెల నేరడిగొండలో ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.2 లక్షల 30వేలకు 10తులాల బంగారం ఇస్తామని రూ.30వేల నగదును తీసుకున్నారు. అలాగే ఆదిలాబాద్‌లోనూ ఇలాగే ఒక వ్యక్తి నుంచి రూ.80వేలు తీసుకున్నారు. మోసాలకు పాల్పడుతున్న గ్రూప్‌లోని ముగ్గురు సభ్యులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి వీరిని అదుపులోకి తీసుకోగా శుక్రవారం వివరాలను పోలీసులు తెలుపడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సంస్కృతిని కాపాడాలి


పూలమాల వేస్తున్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ గిరిజనులు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన హీరాసుక్క జయంతికి ముఖ్యఅతిథిగా హాజరు కాగా ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా డోలువాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముందుగా హీరాసుక్క విగ్రహంతో పాటు చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల ఆదిలాబాద్, జైనథ్, బేల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన కుమ్ర విజయలక్ష్మి, రాజు, గొడం వర్ష సునీల్‌లను శాలువతో సత్కరించారు. అనంతరం భోజారెడ్డి మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, ఆదివాసీలు తమ పిల్లలను చదివించాలని కోరారు. ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు దుర్వ నగేష్, నాయకులు మనోహర్, మెస్రం కృష్ణ, రామేశ్వర్, అశోక్, దివ్య ఉన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 4,780 మంది అర్హత

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 4,780 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వీవీ శ్రీనివాస్‌రావు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఇందులో బీసీ వర్గానికి చెందిన వారు 2,305, ఓసీ వర్గానికి చెందిన వారు 63 మంది, ఎస్సీలు 988 మంది, ఎస్టీలు 1,424 మంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 3,740 మంది, మహిళా అభ్యర్థులు 1040 మంది, ఎక్స్ సర్వీస్‌మెన్ కుటుంబాలకు చెందిన వారు 16 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

అప్లన్లు నమోదు చేసుకోవాలి

ఉట్నూర్: కాళోజీ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ కన్వీనర్ కోటాలో సీటు పొందాలనుకునే గిరిజన విద్యార్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం వరకు టీఎస్‌పీఏఆర్‌ఏఎంఈడీ.టీఎస్‌సీహెచ్‌ఈ.ఇన్ వెబ్ సైట్‌లో వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు నాలుగేళ్లు, బీపీటీ రెండేళ్ల కోర్సులో చేరాలనుకునే గిరిజన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. సీట్ల ఖాళీల వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపర్చడం జరిగిందన్నారు.

'రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించొద్దు'


రైల్వే అధికారులకు విన్నవిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మండల కేంద్రంలోని రైల్వేగేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించొద్దని గ్రామస్తులు రైల్వే అధికారులకు విన్నవించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరైందని రైల్వే అధికారులు శంకర్, జిల్లా ఆర్‌డీవో రమేష్ రాథోడ్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ రాగా గ్రామస్తులు అండర్ బ్రిడ్జి నిర్మించవద్దని రైతులు, గ్రామస్తులు అధికారులకు విన్నవించారు. గత ఏడాది మండలంలోని ఖోడద్, ఉండమ్ గ్రామాల సమీపంలో అండర్ బ్రిడ్జి నిర్మించారని, వర్షాకాలంలో పంట పొలాలకు, గ్రామాలకు వెళ్లేందుకు వీలులేకుండా పూర్తిగా అండర్ బ్రిడ్జి నీటితో నిండిపోతోందని తెలిపారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని తెలిపారు. పంట పొలాలకు వెళ్లేందుకు ఈ ఒక్కటే మార్గం ఉందన్నారు. ఇందులో ఆర్‌డీవో రమేష్ రాథోడ్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు..

జైనథ్: మండలంలోని గూడ గ్రామానికి చెందిన బండారి దేవన్న అనే వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. గూడ గ్రామానికి చెందిన మడావి రాజును అదే గ్రామానికి చెందిన బండారి దేవన్న అనే వ్యక్తి ఈ నెల 3న రాత్రి మద్యం తాగడం కోసం డబ్బులు అడిగాడు. దీంతో మడావి రాజు తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో కోపానికి గురైన దేవన్న రాజును కులం పేరుతో దూషించాడు. అనంతరం గొడ్డలితో రాజుపై దాడి చేశాడు. రాజును స్థానికులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. బాధితుడు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నిందితుడు బండారి దేవన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు


నిందితులతో ట్రాఫిక్ పోలీసులు

నిర్మల్‌చైన్‌గేట్: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ సెకండ్ క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ శుక్రవారం తీర్పునిచ్చారు. ఇటీవల పట్టణంలో వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని నిర్మల్ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ కోర్టులో హాజరు పరిచారు. విచారణ చేసిన న్యాయమూర్తి ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు మరో 67మందికి కలిపి రూ.83,500 జరిమానా విధించారు.

ఖానాపూర్‌లో మరో ఇద్దరికి..

ఖానాపూర్: పోలీసుల వాహనాల తనిఖీల్లో భాగంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన తొమ్మిది మందికి ఖానాపూర్ కోర్టు మేజిస్ట్రేట్ అజయ్ జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. తొమ్మిది మందికి రూ.18వేల జరిమానాతో పాటు ఇద్దరికి 24గంటల జైలు శిక్ష విధించారు.

కోడి పందెం రాయుళ్లపై కేసు

బేల: మండలంలోని చంపెల్లి, పొనాల రెవెన్యూ గ్రామాల శివారులోని అటవీ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రెండు కోళ్లు, రూ.1,670 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే మహారాష్ట్రకు చెందిన ఐదుగురిని పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు..

నటరాజ్ డీలక్స్ థియేటర్ సీజ్


నటరాజ్ డీలక్స్ థియేటర్ ద్వారానికి వేసిన సీల్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని నటరాజ్ డీలక్స్ థియేటర్‌ను మున్సిపల్ అధికారులు శుక్రవారం సాయంత్రం సీజ్ చేశారు. జిల్లా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ ఇటీవల ఆ థియేటర్‌లో సినిమాను తిలకించేందుకు వెళ్లారు. థియేటర్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడాన్ని గుర్తించిన ఆమె మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. బల్దియా పారిశుధ్య విభాగం పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో థియేటర్‌ను సందర్శించిన బల్దియా అధికారులు మూత్రశాలల్లో నిర్వహణ లోపాన్ని గుర్తించారు. ఈ మేరకు థియేటర్‌ను సీజ్ చేసి తాళం వేశారు.

కార్యదర్శి దంపతులకు అండగా ఉంటాం

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శి దంపతులకు అండగా ఉంటామని నిర్మల్ అడిషనల్ కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. తానూర్ మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న గోపినాథ్, జయశ్రీ దంపతులు విధులు ముగించుకొని సాయంత్రం సమయంలో ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో తానూర్ మండలంలోని హిప్నెల్లి చౌరస్తా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ హేమంత్ బొర్కడే శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దంపతులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీడీవోలు, ఎంపీవోలు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

మన్కాపూర్‌కు మెస్రం వంశస్తుల పాదయాత్ర



నార్నూర్: పవిత్ర గంగాజలం కోసం మెస్రం వంశీయులు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మండలంలోని మాన్కాపూర్ గ్రామానికి చేరుకుంది. గ్రామానికి వచ్చిన మెస్రం వంశీయులను గ్రామపటేల్ మెస్రం రూప్‌దేవ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సంప్రదాయంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలతో ఘనంగా స్వాగతం పలికారు. మన్కాపూర్ నుంచి శనివారం ఉదయం జైనూర్ మండలంలోని లెండిజాల గ్రామానికి చేరుకుంటారు.

మంత్రికి పరామర్శ


పుష్పాంజలి ఘటిస్తున్న శ్యాంనాయక్

ఖానాపూర్: బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌కు పితృవియోగం కావడంతో మంత్రిని టీజీఓ జిల్లా అధ్యక్షుడు శ్యాం నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నివాసంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.